www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 15 డిసెంబర్ 2025



నేడు యథావిధిగా 'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటితో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యధావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

అమ్మయ్యగారిపల్లెకు రాజకీయ సెగ

- టిడిపిలో మరో రెండు కుటుంబాలు చేరిక
- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జికి వినూత్న నిరసన
- గ్రామస్తులు మూకుమ్మడిగా ఇళ్లకు తాళాలు
- శాంతిభద్రతల పేరిట పోలీసుల మోహరింపు



ఇంటికి తాళం వేసిన గ్రామస్తులు

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలోని పులివెందుల నియోజకవర్గం వేంపల్లి మండలంలోని అమ్మయ్యగారిపల్లికి రాజకీయ సెగ తగిలింది. మాజీ ముఖ్యమంత్రి కీ.శే వైఎస్ఆర్ హయాం నుంచి వైఎస్ జగన్ హయాం వరకు అమ్మయ్యగారిపల్లి మొత్తం ఒక్కతాటిపై నిలుస్తూ వైఎస్ కుటుంబం వెంట నడుస్తోంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో కడపలో నివాసం ఉంటున్న అమ్మయ్యగారిపల్లికి చెందిన ఓ న్యాయవాది టిడిపిలో చేరడానికి తన స్వగ్రామానికి చెందిన రెండు కుటుంబాలను సిద్ధం చేశారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో టిడిపిలో చేరిన మూడు కుటుంబాలతో కలిపి లెక్కిస్తే తాజాగా చేరిన రెండింటితో కలిపి ఐదు కుటుంబాలు చేరినట్లు తెలుస్తోంది. ఇందులోభాగంగా ఆదివారం టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బీటెక్ రవి ఆదివారం టిడిపికి మద్దతు తెలిపిన కుటుంబాలను పార్టీలోకి చేర్చుకోవడానికి బయల్దేరారు. అమ్మయ్యగారిపల్లికి చెందిన 80 కుటుంబాల్లో 75 కుటుంబాలు వినూత్న నిరసనకు శ్రీకారం చుట్టాయి. టిడిపిలో చేరిన ఐదు కుటుంబాలకు, వారిని ఆహ్వానించడానికి హాజరవుతున్న టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి రాకకు నిరసనగా గ్రామీణులందరూ ఇళ్లకు తాళాలు వేశారు. దీంతో అమ్మయ్యగారిపల్లి నిర్మానుష్యంగా మారింది. కమలాపురం నియోజకవర్గ పరిధిలోని పెండ్లిమర్రి మండలం నందిమండలం సమీపంలోని కొండగంగమ్మ ఆలయానికి చేరుకుని వనబోభనాల పేరిట విందు ఏర్పాటు చేసుకుని ఆరగించడం చర్చనీయాంశంగా మారింది. వైసిపి ఏర్పాటు చేసిన విందుకు వెళ్తున్న పలువురు గ్రామీణుల్ని పోలీసులు అమ్మయ్యగారిపల్లిలో ఏర్పాటు చేసిన విందుకు ఉండాలని అడ్డంకులు సృష్టించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకుండా పోయిందనే వాదన వినిపించింది. అనంతరం వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.వి సతీష్‌రెడ్డి కొండగంగమ్మ ఆలయ పరిసర ప్రాంతంలో ఏర్పాటు చేసిన వనభోజన విందుకు హాజరై గ్రామీణుల ఐకమత్యాన్ని ప్రశంసించారు. అమ్మయ్యగారిపల్లి గ్రామీణులు చూపించిన తెగువ పార్టీకి స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని కొనియాడారు. వైఎస్ జగన్ ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించాలని కోరుకుంటున్నారని తెలిపారు. టిడిపి నాయకులు మాత్రం పోలీసులను అడ్డం పెట్టుకుని ప్రలోభాలతో ప్రజల నుంచి నాయకుల వరకు అందరినీ ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శించడం గమనార్హం.

రబీ సాగు ఆశావహం

68,367 ఎకరాల్లో పంటల సాగు
అన్నమయ్య జిల్లా వ్యవసాయాధికారి జి.శివన్నారాయణ



ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రబీ సీజన్‌లో పంటల సాగు ఆశావహంగా ఉంది. ఈ ఏడాది తుపాన్ ప్రభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో 27 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది. సీజన్ ముగింపు నాటికి లక్ష్యాన్ని అందుకునే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలోని ప్రధాన ఆహారపు పంటలైన వేరుశనగ, వరి, ఉలవ, కంది, మొక్కజొన్న, సజ్జ సాగు ఊపందుకుంది. జిల్లా సాధారణ సాగు లక్ష్యమైన 68,367 ఎకరా లకుగానూ 18,804 ఎకరాల్లోనే విత్తనం పడింది. మదనపల్లి నియోజకవర్గ ప్రాంతంలో వ్యవసాయబోర్ల కింద సాగునీరు అందుతున్న నేపథ్యంలో వరి, వేరుశనగ, ఉలవ, ఇతర పంటల సాగు ఊపందుకుంది. బీ సాగు లక్ష్యాన్ని చేరుకోవడం సులభంగా అందుకునే అవకాశం కనిపిస్తోందని పేర్కొంటున్న నేపథ్యంలో అన్నమయ్య జిల్లా వ్యవసాయశాఖ అధికారి జి.శివన్నారాయణతో ముఖాముఖి...

ముఖా ముఖి..

రబీ సాగు ఎలా ఉంది?

ఈ ఏడాది రబీ సీజన్ ఊపందుకుంది. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణమైన 68,367 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉంది. 18,804 ఎకరాల విస్తీర్ణంలో విత్తనం పడింది. మిగిలిన 73 శాతం విస్తీర్ణంలోనూ బోర్ల కింద సాగు ఊపందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈలెక్కన ఇప్పటి వరకు 27 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది.

ప్రధాన ఆహార పంటల పరిస్థితేమిటి?

జిల్లాలో వేరుశనగ, వరి, ఉలవ, కందులు, మొక్కజొన్న, సజ్జ, మినుము పంటలు ప్రధాన పంటలు. ఇందులోని ప్రధాన ఆహారపు పంట వేరుశనగ 4,100 ఎకరాలు, ఉలవలు 19,760 ఎకరాలు, వరి 370 ఎకరాలు, ఉలవ 13,434 ఎకరాలు, మొక్కజొన్న 37 ఎకరాలు, మినుము 195 ఎకరాల్లో విత్తనం పడింది. తుపాన్ పరిస్థితుల కారణంగా ఎండుతున్న పంటలకు పెద్దఎత్తున ఉపశమనం లభించింది. దిగుబడులు ఏ స్థాయిలో ఉంటాయో వేచి చూడాల్సి ఉంది.

డ్రోన్ల లభ్యత ఎలా ఉంది?

జిల్లాలోని 30 మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున డ్రోన్ అందించాల్సి ఉంది. మొదటి విడతలో భాగంగా 25 మందిని గుర్తించడమైంది. 16 డ్రోన్స్ సరఫరా చేయడమైంది. మిగిలిన వాటిని త్వరలో అందుబాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

ఇ-క్రాప్ వివరాలు తెలపండి?

జిల్లాలోని 271 ఆర్ఎస్‌కెల మ్యాపింగ్ పూర్తిచేశాం. రేపటి నుంచి ప్రారంభిస్తున్నాం. వ్యవసాయశాఖ సిబ్బందికి బాధ్యతలు అప్పగించాం. జిల్లా రైతాంగం తప్పనిసరిగా సాగు చేసిన పంటలకు ఇ-క్రాప్ చేసుకోవాలి. నిర్లక్ష్యం వహించడం తగదు. పంటల ప్రకృతి విపత్తుల బారిన పడితే తీవ్రంగా నష్టపోతామని గ్రహించాలి.

భూసార పరీక్షలపై స్పందించండి?

భూసార పరీక్షలు లక్ష్యాన్ని అధిగమిస్తాం. 2025లో 23 వేల మట్టి శ్యాంపిళ్లను పరీక్షించాలనే లక్ష్యాన్ని నిర్ణయించాం. కడప జిల్లాకు 11,500 వేల శాంపిళ్లను పంపించాం. మిగిలిన 11,500 శాంపిళ్ల పరీక్షల్ని పరీక్షించాల్సిన అవసరం ఉంది.

ప్రత్యామ్నాయ ప్రణాళిక అమలు ఎలా ఉంది?

కంటిజెన్స్ ప్రణాళిక అమల్లో ఉంది. సుమారు 7 వేల క్వింటాళ్ల మేరకు ఉలవ విత్తన పంపిణీ చేయడానికి ప్రతిపాదనలు పంపించడమైంది. 40 శాతం సబ్సిడీ కింద 9,200 క్వింటాళ్లు వేరుశనగ కంటిజెన్స్ ప్రణాళిక, ఎరువుల పరిమాణం, విత్తన కేటాయింపులు అమల్లో ఉన్నాయి.

ఎరువుల లభ్యత ఎలా ఉంది?

జిల్లాలో ఎరువులు, పురుగు మందుల లభ్యతకు ఎలాంటి డోకా లేదు. 15 వేల క్వింటాళ్ల మేర ఎరువుల నిల్వలు ఉన్నాయి. ప్రధానమైన యూరియా 4,112 క్వింటాళ్లు, డిఎపి 2,202 క్వింటాళ్లు, ఎంఒపి 1,275 క్వింటాళ్లు, ఎన్‌పికెస్ 6703 క్వింటాళ్లు, ఎస్ఎస్‌పి 1691 క్వింటాళ్లు, కంపోస్టు ఎరువు 4 క్వింటాళ్లు, ఎఫ్ఒఎం ఒక క్వింటాలు చొప్పున సిద్ధంగా ఉంది.

30 శాతం ఐఆర్ ప్రకటించాలి

మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి



మాట్లాడుతున్న పోచంరెడ్డి సుబ్బారెడ్డి

ప్రజాశక్తి - రాయచోటి

కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అధికారంలోకి వచ్చిన వెంటనే 12వ ఐఆర్, ఇఎలను సకాలంలో చెల్లిస్తామని చెప్పి ఉద్యోగులను ఉపాధ్యాయులను పెన్షనర్లకు ఇవ్వకపోవడం దగా చేయడమే అని, ఇప్పటికైనా 30 శాతం ఐఆర్ ప్రకటించాలని మాజీ ఎమ్మెల్సీ పోచం రెడ్డి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం పట్టణంలోని విజ్ఞాన్ పాఠశాలలో రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా పోచం రెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన సంవత్సరం లోపల సిపిఎస్ విధానాన్ని సమీక్షించి దాని రద్దుచేసి ఓల్డ్ పెన్షన్ విధానాన్ని తీసుకొని వస్తామని హామీ ఇచ్చి ప్రభుత్వం 18 నెలలు గడిచినా సిపిఎస్ పై సమీక్ష చేయకుండా కాలయాపన చేస్తుందని ఇప్పటికైనా సిపిఎస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర అధ్యక్షులు లెక్కల జమాల్ రెడ్డి మాట్లాడుతూ నెల నెల ఒకటో తారీకు జీతాలు చెల్లిస్తామని చెప్పి పదవ తారీకు వచ్చినా చెల్లించక పోవడం ఉద్యోగులను ఇబ్బందులు గురి చేయడమేనని పేర్కొన్నారు. విరమణ చెందిన ఉద్యోగులకు గ్రాట్యూటీ, సరెండర్ లీవ్ గత 18 నెలల కాలంగా చెల్లించకపోవడం దురదృష్టమని, వెంటనే చెల్లించాలని అన్నారు. రాష్ట్ర గౌరవాధ్యక్షులు పి.సి రెడ్డన్న మాట్లాడుతూ రెగ్యులర్ ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు, పెన్షనర్లకు రూ. 31 వేల కోట్ల బకాయిలను దశలవారుగా చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి ఇలియాస్ రెడ్డి మాట్లాడుతూ డిఎ అరియర్స్ వెంటనే జిపిఎఫ్ ఖాతాలకు చెల్లించాలని, పెన్షనర్లకు, సిపిఎస్ ఉద్యోగులకు నగదుగా వెంటనే చెల్లించాలన్నారు .రాష్ట్ర ఉపాధ్యక్షులు పురుషోత్తం రెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలనీ, విద్యార్థులను ఉపాధ్యాయులను మానసిక వేదనకు గురి చేయవద్దని చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు రామాంజనే యరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఎస్. మునిరెడ్డి, వైఎస్ఆర్ కడప జిల్లా అధ్యక్షులు పి.వి. సుబ్బారెడ్డి, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు చెన్నుపల్లి ఓబుల్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి జక్రియ బాషా, మైనారిటీ కన్వీనర్ లియాకత్ ఆర్థిక కార్యదర్శి భోగ వెంకటసుబ్బయ్య, ఎస్‌టియు బాధ్యులు బాలిరెడ్డి, అబీబుర్, రెహమాన్, రామ్మో హన్, దిలీప్, నారాయణరెడ్డి, ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు బి. వెంకటరమణ,రాష్ట్ర బాధ్యులు, జిల్లాల బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయుల క్రీడా సంబరం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మండల స్థాయి ఉపాధ్యాయుల క్రీడా సంబరం ఆదివారం పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్య అతిథిగా హాజరై క్రీడలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులను బావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు పాత్ర క్రియాశీలకమని కొనియాడారు. విద్యతోపాటు క్రీడలల్లో విద్యార్థులను ప్రోత్సహించాలంటే ఉపాధ్యాయులు సైతం క్రీడల్లో అవగాహన కలిగి ఉండాలన్నారు. అందుకు ఉపాధ్యాయ క్రీడలు ఎంతో దోహద పడతాయన్నారు. ఈ క్రీడలను మహిళా, పురుష ఉపాధ్యాయులకు విడివిడిగా నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో భాగంగా క్రికెట్ బ్యాట్ చేతబట్టి చక్కని షాట్లతో అలరించారు. అదేవిధంగా పాఠశాల ఆవరణంలో నిర్మిస్తున్న డైనింగ్ హాల్ నందు జరుగుతున్న గ్రానైట్ పనులను పరిశీలించారు. ఈ డైనింగ్ హాల్ పూర్తయితే విద్యార్థులు భోజనం చేయడానికి ఎంతో సౌలభ్యంగా ఉంటుం దన్నారు. ఈ హాల్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.15 లక్షలు మంజూరు చేయగా, మిగిలిన ఖర్చును తామే భరించి రూ.50 లక్షలతో పూర్తి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. విద్యారంగంలో మంత్రి నారా లోకేష్ విప్లవాత్మకమైన మార్పులు తీసుకొస్తు న్నారని, ఆయన స్ఫూర్తితో నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానో పాధ్యాయుడు సుబ్బారెడ్డి, బీదం గురునాథ్‌యాదవ్, కొప్పల హరినాథ్, జీవి నాయుడు, బాలమాలి శేఖర్, చల్లా చలపతి, సాయి, టిడిపి నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



క్రికెట్ ఆడి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

ధ్యానంతో మనసు ప్రశాంతత



విలేకరులతో మాట్లాడుతున్న క్రాంతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

మనసు ప్రశాంతతకు, ఆరోగ్యానికి, ఒత్తిడిని అధిగమించేందుకు ధ్యానం ఎంతో అవసరమని ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్ క్రాంతి తెలిపారు. ఆదివారం స్థానిక కన్యాకా పరమేశ్వరి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ గురుదేవ్ రవిశంకర్ స్థాపించిన ఆర్ట్ ఆఫ్ లివింగ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందులో మెడిటేషన్ కార్యక్రమం చాలా ముఖ్యమైందని తెలిపారు. సుదర్శన క్రియ మనిషి జీవితంలో ఎంతో మార్పు తీసుకొస్తోందని, మానసిక ఒత్తిడిని అధిగమించి ప్రశాంతకరమైన జీవితం గడిపేందుకు ఎంతో ఉపయోగకరంగా ఉంటోందన్నారు. ఈ నెల 21న ప్రపంచ మెడిటేషన్ డే సందర్భంగా గురుదేవ్ రవిశంకర్ యునైటెడ్ కింగ్‌డమ్ నుంచి మెడిటేషన్ లో పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో 180 దేశాల నుంచి కోట్లాది మంది వర్చువల్ విధానంలో పాల్గొంటున్నట్లు తెలిపారు. ప్రతిఒక్కరూ 21న రాత్రి 8:30 గంటలకు యూట్యూబ్ లో గురుదేవ్ రవిశంకర్ ఛానల్‌కు లాగిన్ అయ్యి లోకంతో పాటు మనమూ ధ్యానంలో మమేకం కావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మదనపల్లె ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు, ఆర్ట్ ఆఫ్ లావింగ్ అపెక్స్ మెంబర్ ఓంప్రకాష్ పాల్గొన్నారు.

జాతీయ లోక్‌అదాలత్‌లో కడప జిల్లాకు రాష్ట్రస్థాయి 3వ ర్యాంక్

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామిని

ప్రజాశక్తి - కడప : జాతీయ లోక్ అదాలత్ లో 39,120 కేసులు పరిష్కరించి రూ. 32.43 కోట్ల మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించి రాష్ట్ర స్థాయిలో వైఎస్ఆర్ కడప జిల్లా 3వ ర్యాంకు సాధించినట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, సీనియర్ సివిల్ జడ్జి, ఎస్. బాబా ఫక్రుద్దీన్ తెలిపారు. జాతీయలోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 38498 క్రిమినల్ కేసులు, 274 సివిల్ కేసులు, 348 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొ న్నారు. కడప లో 4097 కేసులు, ప్రొద్దుటూరులో 2314 కేసులు, రాజం పేటలో 2187 కేసులు, రాయచోటిలో 4372 కేసులు, బద్వేల్‌లో 6476 కేసులు, మైదుకూరులో 2081 కేసులు, జమ్మలమడుగులో 5337 కేసులు, సిద్ధవటంలో 1681 కేసులు, రైల్వేకోడూరులో 1813 కేసులు, పులివెం దులలో 2113 కేసులు, నందలూరులో 1032 కేసులు, లక్కిరెడ్డిపల్లిలో 3120 కేసులు, కమలాపురంలో 2497 కేసులు పరిష్కారమ య్యాయన్నారు.

ఒంటిమిట్ట, సిద్ధవటంను కడప జిల్లాలోనే ఉంచాలి

రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



దీక్షలకు మద్దతు తెలుపుతున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి

ప్రజాశక్తి - ఒంటిమిట్ట

జెఎసి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి సంఘీభావం తెలిపారు. ఆదివారం ఉదయం 11 గంటలకు సంఘీభావం దీక్షా శిబిరానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అప్పటి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రజల ఆకాంక్ష మేరకే ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను కడప రెవెన్యూ డివిజన్‌లో చేర్చారని చెప్పారు. ఇప్పుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దురుద్దేశంతోనే రాజకీయ కక్షతో నేడు తిరిగి ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను అన్నమయ్య జిల్లాల్లో కలపడం తగదని పేర్కొన్నారు. ఏ ప్రభుత్వం వచ్చినప్పటికీ ప్రజల బాగోగులే మనకు అవసరమని పేర్కొన్నారు. రాజకీయాలలో కక్ష సాధింపులు ఉండకూడదని తెలిపారు. ఒంటిమిట్టకు ఒక చరిత్ర ఉందని అదే, సిద్ధవటం మండలానికి కూడా ఒక గొప్ప పురాతన చరిత్ర ఉందని చెప్పారు. ఒంటిమిట్ట జెఎసి నాయకులు నిర్వహిస్తున్న కార్యక్రమానికి రవాడం తాను ఎంతో గర్విస్తున్నానని అన్నారు. ఎట్టి పరిస్థితులలో ఒంటిమిట్ట, సిద్ధవటం మండలాలను యధా స్థితిలో ఉంచేందుకు పోరాటం చేస్తామని అన్నారు. ఒంటిమిట్ట సిద్ధపటం జేఏసీ నాయకులకు ప్రజలకు తమ మద్దతు పూర్తిగా ఉంటుందని పేర్కొన్నారు. పార్టీలకు అతీతంగా అందరూ కలిసికట్టుగా ఉద్యమం చేపట్టి సాధించుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం జడ్‌పి వైస్ చైర్మన్ ఎరగం రెడ్డి సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఒంటిమిట్ట, సిద్ధపటం మండలాలను తిరిగి కడపలో చేర్చేంతవరకు ఉద్యమం చేపడతామని అన్నారు. ఇక్కడ రాజకీయాలు ముఖ్యం కాదని ప్రజలే అవసరాలే అన్నారు. వైసిపి సీనియర్ నాయకులు రాష్ట్ర డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడి ఒంటిమిట్టను నిలబెట్టుకుంటామని అన్నారు. కార్యక్రమంలో పెన్న పేరు రూరు ఎంపిటిసి, నారాయణరెడ్డి. మండల వైసిపి అధ్యక్షులు శివారెడ్డి, లక్ష్మీనారాయణరెడ్డి, రవిచంద్రరాజు , రామిరెడ్డి, మాధవరం సర్పంచ్ పన్నీరు, మాధవరం సర్పంచ్ పన్నేల చంద్ర, మురళి సాలాబాద్ మాజీ ఎంపిటిసి శ్రీనివాసరెడ్డి, మెరువ శివ నారాయణ .దనంతరంపల్లి సర్పంచ్ లక్ష్మీనారాయణరెడ్డి, రాచపల్లి గురుమోహన్‌రాజు, వైసిపి నాయకులు,కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న రవీంద్ర

పేదలకు అందుబాటులో డయాలసిస్ సెంటర్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్

పట్టణంలో ప్రారంభిస్తున్న డయాలసిస్ సెంటర్ సేవలను పేదలు సద్విని యోగం చేసు కోవాలని రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎంకె.రవీంద్ర, బెంగళూరు కిడ్నీ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శ్రీరాములు పిలుపునిచ్చారు. రోటరీ సేవా ట్రస్ట్, జెపి మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డయాలసిస్ సెంటర్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల కోసం ఎటువంటి లాభ పేక్ష లేకుండా డయాలసిస్ సెంటర్‌ను నిర్వహించడం గొప్పవిషయమన్నారు. వైద్యశాలల్లో డయాలసిస్ చేసేందుకు వేలాది రూపాయలు ఫీజు రూపంలో వసూలు చేస్తున్న తరుణం లో ఎటువంటి లాభాపేక్ష లేకుండా కేవలం రూ.1200లకే పేదలకు డయాలసిస్ కేంద్రాన్ని నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. జెపి ఎమర్జెన్సీ అండ్ మల్టీ స్పెషా లిటీ ఆసుపత్రి జయప్రకాశ్‌రెడ్డి డయాలసిస్ సెంటర్ నిర్వహణకు ఎంతో చేయూత నిస్తుండటం ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో రోటరీ సేవా ట్రస్ట్ అధ్యక్షుడు కూనా కృష్ణదేవ రాయలు, వైస్ ప్రెసిడెంట్ సురేష్‌కుమార్, సభ్యులు వైవిఎస్ ప్రకాష్ డాక్టర్ జయప్రకాశ్ రెడ్డి , క్లబ్ మాజీ అధ్యక్షులు ఎస్కే హుస్సేన్, మనోజ్, రియాజ్, డాక్టర్ రెడ్డన్న, సుబ్రహ్మ ణ్యం, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

'మోదుగుల'ను కలిసిన 'చమర్తి'

ప్రజాశక్తి-రాజంపేట



చమర్తిని సన్మానిస్తున్న మోదుగుల పెంచలయ్య

టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు రాజంపేట పట్టణంలో పర్యటిస్తూ టిడిపి సీనియర్ నాయకులు, శ్రీ అన్నమాచార్య విద్యాసంస్థల అధినేత మోదుగుల పెంచలయ్యను వారి స్వ గృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ రాజ ంపేట నియోజకవర్గ అభివృద్ధి, నాయకుల ఐక్యత , ప్రజా సమస్యలపై ఇరువురూ చర్చించినట్లు తెలిపారు.పార్టీ పతిష్టత, నియో జకవర్గ అభివృద్ధికి సంబంధించి వారి నుంచి పలు సలహాలు, సూచనలు స్వీకరించినట్లు తెలి పారు. అనంతరం చమర్తి జగన్‌మోహన్‌రాజును మోదుగుల పెంచలయ్య ఘనంగా సత్క రించారు. కార్యక్రమంలో ఎన్‌జిఒ సంఘ మాజీ అధ్యక్షులు, జిల్లా మలేరియా విశ్రాంత అధికారి లావలూరి శ్రీనివాసులు, ఊటుకూరు చెరువు సంఘం అధ్యక్షులు నామహరినాథ్, నారాయణ నెల్లూరు నాయకులు పలుకూరి ఉగ్ర రవీంద్ర పాల్గొన్నారు.



అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న నాయకులు

సర్వేయర్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడిగా రమేష్‌బాబు

ప్రజాశక్తి-పీలేరు

పీలేరు రెవిన్యూ డివిజన్ ఆంధ్రప్రదేశ్ సర్వేయర్స్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయి. ఆదివారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో పీలేరు మండల సర్వేయర్ రెడ్డిశేఖర్, సంబేపల్లి మండల సర్వేయర్ హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఎన్నికల నిర్వహణాధికారిగా మదనపల్లి డివిజన్ మాజీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు చక్రపాణి నాయుడు వ్యవహరించారు. నూతన పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని పీలేరు, కెవి పల్లి, కలకడ, గుర్రంకొండ, వాల్మీకిపురం, కలికిరి, సదుం, సోమల మండలాల్లో పనిచేసే సర్వేయర్లు పాల్గొని నూతన కమిటీని ఎందుకు ఇవ్వడం జరిగింది. పీలేరు రెవెన్యూ డివిజన్ అధ్యక్షులుగా సి. రమేష్ బాబు, ఉపాధ్యక్షులుగా ఎన్. హర్షద్ అయూబ్ ఖాన్, కార్యదర్శిగా జి. శరత్ కుమార్, జాయింట్ సెక్రటరీగా సి. అన్నపూర్ణ, కోశాధికారిగా బి. విజయ్ కుమార్ నాయక్, కార్యవర్గ సభ్యులుగా జి. మీనా, ఎం. మనోజ్ కుమార్, ఎస్. పవన్, పి. పవన్ కుమార్, బి. అనిల్ కుమార్ రెడ్డి, కె. గోపి లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా కొత్తగా ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ పీలేరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ఉద్యోగుల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని అన్నారు. ఈ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలుపుకున్నారు.

ఎస్‌టియు జిల్లా మైనార్టీ కన్వీనర్‌గా మున్వర్‌బాషా

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : కర్నూలు జిల్లా ఎస్‌టియు మైనార్టీ విభాగం కన్వీనర్‌గా ఎస్ఎ మున్సవర్‌బాషా ఎన్నికైనట్లు తెలపారు. రెండు రోజుల క్రితం రాయచోటిలోని భాస్కర్ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగిన 79వ ఎస్‌టియు వార్షికోత్సవ జనం వార్షికోత్సవ దినోత్సవ సందర్భంగా ఎంపిక జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను రెండో పర్యాయం జిల్లా మైనార్టీ కన్వీనర్‌గా ఎంపిక చేయడం సంతోషదాయమన్నారు. తన ఎంపిక కృషి చేసిన ఎస్‌టియు రాష్ట్ర కౌన్సిలర్లు నేతలకు ఆయన కృత జ్ఞతలు తెలిపారు. సంఘ నియమాలకు కట్టుబడి పని చేస్తానని, తనకు అప్పగిం చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు.

17న జాతీయ పెన్షనర్ల దినోత్సవం

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్ : ఈనెల 17న రాయచోటి పట్టణంలో నిర్వహించే జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని జయప్రదం చేయాలని జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు వెంకటరమణ కార్యదర్శి చెన్నారెడ్డి కోరారు. ఎన్‌జిఒ సభా భవనంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవంను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఖజానా శాఖ అధికారి, జిల్లా ఎన్‌జిఒ సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి హాజరవుతారని తెలిపారు. సమావేశంలో పెన్షనర్ల జీవన ప్రమాణ పత్రాలను అధికారులకు ఎలా సమర్పించాలో అవగాహన కల్పిస్తామని చెప్పారు. 70 ఏళ్లు పైబడిన పెన్షనర్లకు సన్మాన కార్యక్రమం జరుగుతుందన్నారు.



నక్కలవాండ్లపల్లెలో రామాలయానికి భూమిపూజ చేస్తున్న లక్ష్మీప్రసాద్‌రెడ్డి

ఆలయాల నిర్మాణాలకు రూ.5కోట్లు నిధులు మంజూరు

ప్రజాశక్తి-గాలివీడు

రాయచోటి నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ రకాల ఆలయాల నిర్మాణాలకు రూ.5.40కోట్లు నిధులు మంజూరైనట్లు నియోజకవర్గ టిడిపి నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని నూలివీడు పంచాయతీ నక్కలవాండ్లపల్లెలో 60 లక్షల రూపాయల నిధులతో ఏర్పాటు చేయనున్న రామాలయానికి భూమిపూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయచోటి. మాసాపేటలోని యశోద కృష్ణయాలయానికి రూ.80లక్షలు, సంబేపల్లి మండలం లోని పెద్ద బిడికిలో కోదండరామ ఆలయానికి రూ.45 లక్షలు, నడిమిరాజపల్లి రాములవారి దేవాలయానికి రూ.40లక్షలు, రాయచోటి రూరల్ మండలంలోని సిబ్యాలలో అనుమపల్లెలో రాములోరి గుడికి రూ.74 లక్షలు, భోగ్యం పల్లెలు రామ ఆలయానికి రూ.32లక్షలు, రామాపురం మండలంలోని ముసలిరెడ్డిగారి పల్లెలో రామాలయ నిర్మాణానికి రూ.32లక్షలు, దూదేకులపల్లె రామాస్వామి గుడికి రూ.28 లక్షలు, పేమ్మడపల్లి లోని రాముల గుడికి రూ.25 లక్షలు మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు. ఆలయాల నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసి ప్రజలు పూజలు చేసుకోవడానికి అందుబాటులోకి తేవడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎన్‌జిఒ నేతకు మాతృవియోగం

ప్రజాశక్తి-రామాపురం

ప్రజా చైతన్య సేవా సంస్థ అధినేత గడికోట చెన్నారెడ్డి మాతృమూర్తి రామలమ్మ(85) ఆదివారం చెన్నారెడ్డి స్వగ్రామం సుద్దమల పంచాయతీ దేవలపల్లి, అనారోగ్యంతో మృతి చెందారు. గ్రామస్తులతో మరణ వార్త తెలుసుకున్న వైసిపి ప్రధాన కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి, మోహనరెడ్డి దేవలపల్లికి వెళ్లి రామలమ్మ మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం చెన్నారెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. వీరి వెంట మాజీ ఎంపిపి గడికోట ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్‌రెడ్డి ఉన్నారు.

రేపు నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూముల వేలం

ప్రజాశక్తి-నిమ్మనపల్లె

మండల పరిధిలోని శ్రీయోగ నేలమల్లేశ్వరస్వామి ఆలయ భూములు(మామిడి తోటలను) కౌలుకై మంగళవారం వేలం వేయనున్నట్లు ఆలయ ఇఒ. మంజుల తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తవళం గ్రామ సచివాలయం వద్ద ఉదయం 11గంటలకు దేవాదాయ శాఖాధికారుల ఆధ్వర్యంలో ఆలయ భూముల బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నామన్నారు. ఆసక్తి కలిగిన రైతులు ధరావత్తు సొమ్ము చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు. వేలంపాటలో భూములను దక్కించుకున్న వారికి కౌలుకు ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు.

భారీ ర్యాలీని విజయవంతం చేయండి

-బేపారి మహమ్మద్ ఖాన్

ప్రజాశక్తి-రాయచోటి అర్బన్



మాట్లాడుతున్న బేపారి మహమ్మద్‌ఖాన్

పట్టణంలో సోమ వారం వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించే భారీ ర్యాలీని విజయవంతం చేయాలని జిల్లా వైసిపి మైనార్టీ విభాగం అధ్యక్షుడు బేపారి మహ మ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. ఆది వారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రైవేటీకరణను నిరసిస్తూ వైసిపి ఆధ్వర్యంలో నిర్వహించిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసినట్లు చెప్పారు. జిల్లా కేంద్రంలోని కోటి సంతకాల సేకరణ ప్రతులను రాష్ట్ర రాజధానికి తరలించే కార్యక్రమం సందర్భంగా భారీ ర్యాలీను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. జిల్లాలోని వైసిపి నేతలు, కార్యకర్తలు ఉదయం 9 గంటలకు ఎన్ఎస్ కార్యాలయానికి వైసిపి కార్యాలయం వద్దకు చేరుకోవాలన్నారు. 10గంటలకు గంటలకు శివాలయం చెక్ పోస్ట్ నుంచి నేతాజీ సర్కిల్ వరకు పెద్ద ఎత్తున ర్యాలీని నిర్వహించడం జరుగుతుందన్నారు. ర్యాలీలో నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

స్థానిక ఎన్నికల్లో ప్రతిచోటా వైసిపి అభ్యర్థి : పిఆర్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి చోటా వైసిపి అభ్యర్థిని నిలబెడుతామని ఎమ్మెల్సీ, వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త పి.రామసుబ్బారెడ్డి తెలిపారు. స్థానిక వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సోది నారాయణరెడ్డి కాదు.. సూది నారాయణరెడ్డి అంటూ సూది చెప్పుతూ అంటూ అని ధ్వజగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే 2029 ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెబుతారని పేర్కొన్నారు. పెన్నా, చిత్రావతి నుంచి ఇసుక అమ్ముకుంటూ కోట్లు కడుతుంటే ఆహారంగా మాట్లాడుతున్నారు. ఒక్కో కారు రూ.3 కోట్లు, రూ.4 కోట్లు పెట్టి కొని తిరుగుతూ అవినీతి సామ్రాజ్యాన్ని స్థాపించారన్నారు. పులివెందుల జెడ్‌పిటిసి ఉపఎన్నిక గురించి ఆది నారా యణరెడ్డి మాట్లాడడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎంపీ అవినాష్‌రెడ్డి గురించి మాట్లాడడం సరికాదన్నారు. ముద్దనూరు ఎంపిపి ఎన్నికల్లో పేదవాళ్లైన ఓసి, బిసి, ఎస్సి ఎంపిటిసిలకు ఉన్న విలువలు కూడా మీకు లేదు, యావన్మంది మీ చెంతలతో భయపెట్టాలని చూసినా, ప్రలోభాలకు గురిచేయాలని చూసినా లొంగలేదన్నారు. కార్యక్రమంలో వాణిజ్య విభాగ నియోజకవర్గ ప్రతినిధి సట్టకారు శివ సుబ్రహ్మణ్యం, విశ్వేశ్వరరెడ్డి, రవి, ఆంజ నేయులు, మోహన్‌రెడ్డి, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలి

ప్రజాశక్తి - చాపాడు

రైతులు పండించిన పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించాలని వైసిపి రైతు విభాగం రాష్ట్ర జాయింట్ సెక్రటరీ రవిశంకర్ రెడ్డి కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో వరి పంట నూర్పిడి పనులు ప్రారంభమయ్యాయన్నారు. ప్రభుత్వం నామమాత్రంగా రూ.13వేలతో ధాన్యం సేకరిస్తూ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పూర్తిస్థాయిలో కొనుగోలు చేపట్టడం లేదన్నారు. దళారులు 8 బస్తాల ధర కేవలం రూ.11 వేలకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు లేక రైతులు ఆర్థికంగా నష్టపోతు న్నారన్నారు. ఈ ఏడాది ఉల్లి రైతులు కూడా తీవ్రంగా నష్టపోయారని ఆయన గుర్తు చేశారు. వరుస తుపానుతో రబీలో సాగుచేసిన పంటలు కూడా సరిగా దిగుబడి వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతులు విత్తనాలు రెండు మూడు దఫాలు కొనుగోలు చేసి సాగు చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రైతుల తరపున నిరంతరం పోరాడుతామన్నారు. తన నియామకానికి సహకరించిన వైసిపి రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధికి, రైతు సంక్షేమానికి నిత్యం పోరాటాలు సాగిస్తామన్నారు.

21న కలమల్ల శాసన శిల్పిక ఆవిష్కరణ

ప్రజాశక్తి - చాపాడు :కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో తొలి తెలుగు కలమల్ల శాసన శిల్పిక (ప్రతిరూపం)ను ఈనెల 21న జానమద్ది సాహితీ పీఠం ఆధ్వర్యంలో ఆవిష్కరిస్తున్నట్లు చరిత్రకారుడు బొమ్మిశెట్టి రమేష్ ఆదివారం తెలిపారు. కలమల్ల లోని తొలి తెలుగు శాసనం ఒరిజినల్ ఐదు అడుగుల ఆరు అంగుళాలు ఉండగా ప్రస్తుతం చెన్నై మ్యూజియంలో ఉన్నదని తెలిపారు. శాసనం ఎండకూ, వర్షానికీ భవిష్యత్తులో అంతరించిపోయే దశలో ఉందని పేర్కొన్నారు. ఈ శిలాశాసనాన్ని కాపాడాలనే ఉద్దేశ్యంతో రూపొందించిన శిల్పికకు స్వర్ణభారత్ ట్రస్ట్ నిర్వాహకులు పూర్వ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు కుమార్తె దీపా వెంకట్ సహకారముందన్నారు. సాహిత్యకారులు, రచయితలు, చరిత్రకారులు, కవులు, పుర ప్రజలు వివిధిగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

జిల్లా కేంద్రం కోసం కలిసికట్టుగా పోరాటం : 'చమర్తి'



సమావేశంలో మాట్లాడుతున్న చమర్తి

ప్రజాశక్తి-రాజంపేట

కలిసికట్టుగా జిల్లా కేంద్రం కోసం పోరాడుదామని టిడిపి నియోజకవర్గ ఇన్‌చార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పిలుపునిచ్చారు. ఆదివారం మండల పార్టీ అధ్యక్షులు మేడికొండ రవికుమార్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య నాయకులతో మండల స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాజంపేటకు తీరని అన్యాయం చేసిందని, చేసిన తప్పులను ఒప్పుకోకుండా వైసిపి వక్రబుద్ధి ప్రదర్శిస్తున్నారని పేర్కొన్నారు. కలిసికట్టుగా ఐక్యతతో జిల్లా కేంద్రాన్ని సాధిం చుకుందామని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ గన్నే సుబ్బనరసయ్యనాయుడు, సింగిల్‌విండో అధ్యక్షులు ముల్లగూరి సుబ్రహ్మణ్యం నాయుడు, మాజీ మండల అధ్యక్షులు బాపనయ్య నాయుడు పాల్గొన్నారు.

ప్రారంభమైన నిరాహారదీక్షలు

రిలేదీక్షలు ప్రారంభం

రైల్వేకోడూరు: అన్నమయ్య జిల్లా కేంద్రంగా రాజంపేట ను ప్రకటించాలంటూ రైల్వేకోడూరులో ఆదివారం జెఎసి, జెసి ఆధ్వర్యంలో నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం రాజంపేటను జిల్లా కేంద్రం చేస్తామంటూ హామీ ఇచ్చారని హామీని అమలు చేసి రాజంపేట జిల్లా కేంద్రంగా ప్రకటించే వరకు రిలే నిరాహార దీక్షలు కొనసాగిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త మాదినేని విశ్వేశ్వర నాయుడు, టిడిపి సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు పంతగాని నరసింహ ప్రసాద్, ఈ జెఎసి నాయకులు ప్రయివేట్ డిగ్రీ, జూనియర్ కళాశాలలు, హై స్కూల్ ప్రిన్సిపల్ లు, కరస్పాండెంట్లు ముత్యాల పెంచలయ్య, ఎంపీ కుమార్, ఎస్ఎస్ శ్రీనివాసులు, తులసి, గోపీచంద్, జెఎసి నాయకులు టి.నాగేంద్ర, ముత్యాల కిషోర్, డాక్టర్ సయ్యద్ అహ్మద్, ఉత్తరాది మహేష్ పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్షలు చేస్తున్న నాయకులు

ఫిబ్రవరి 1న అన్నమయ్య కీర్తన నృత్య కైంకర్యం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ప్రజాశక్తి-రాజంపేట

ఫిబ్రవరి 1వ తేదీన రాజంపేటలో శివ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో 1008 మంది నృత్య కళాకారులతో నిర్వహించనున్న నోబుల్ ప్రపంచస్థాయి రికార్డు శ్రీ అన్నమయ్య కీర్తన నృత్య కైంకర్యాన్ని దిగ్విజయం చేయాలని కౌన్సిలర్ రేనాటి రాఘవేంద్ర వర్మ, సినీ దర్శకులు శివమణి, ప్రముఖ చిత్ర కళాకారులు నాయిని గిరిధర్, ద్రోణాచార్య మార్షల్ ఆర్ట్స్ అకాడమీ గ్రాండ్ మాస్టర్ బి.సునీల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పూర్వ అభ్యాసనం ఆదివారం జిఎంసి కల్యాణమండపంలో అట్టహాసంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నృత్య కళ మీద మక్కువతో చిన్నతనంలో సినిమా పాటలకు స్టెప్పులేస్తూ జీవితాన్ని ప్రారంభించిన నృత్య గురువు పెనిగలపాటి శివప్రసాద్ నేడుఎంతోమందికి ఆదర్శ గురువుగా నిలుస్తున్నారని చెప్పారు. శాస్త్రీయ నృత్యానికి మకుటంలా నిలిచారని కొనియాడారు. ఆయన ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న నిర్వహించనున్న కార్యక్రమం దిగ్విజయమై రాజంపేట కీర్తిని ప్రపంచానికి చాటాలని ఆకాంక్షించారు. నృత్య గురువు పెనిగలపాటి శివప్రసాద్ మాట్లాడుతూ ఫిబ్రవరి ఒకటవ తేదీన జరిగే కార్యక్రమానికి నృత్య కళాకారులు సాంప్రదాయ దుస్తులతో హాజరవ్వాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులను లక్కీ డ్రిప్ ద్వారా ఎంపిక చేసిన పదిమంది కళాకారులకు ఐదు రోజులపాటు ఉచితంగా మలేషియా పర్యటన ఉంటుందని తెలిపారు. సప్తగిరుల స్వామికి నృత్య నైవేద్యం ఇచ్చే అవకాశం పొందిన ప్రతి ఒక్కరూ ధన్యులని, చిత్తశుద్ధితో ఈ కార్యక్రమంలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నృత్య కళాకారులు, తల్లిదండ్రులు, వీక్షకులు పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులోలేని కోడిగుడ్డు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మార్కెట్‌లో కోడిగుడ్ల ధరలు సామాన్యులకు షాకిస్తున్నాయి. ప్రస్తుతం డజన్ కోడి గుడ్ల ధర రూ.80పైనే పలుకుతోంది. ఒక్క కోడి గుడ్డు ధర రూ.8అమ్ముతున్నారు. మాంసం ధరలు అధికంగా ఉండడంతో కోడిగుడ్లు అయినా తిందా మనుకున్నా సామాన్యులకు భారంగా మారింది. ప్రస్తుతం చలి వణికిస్తుండడంతో కోడిగుడ్ల ఉత్పత్తి తగ్గిందని వ్యాపారాలు పేర్కొంటున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ కోడిగుడ్ల ధరలు విపరీతంగా పెరిగాయి. ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి ఇబ్బందులు పడుతున్న జనానికి గుడ్డు ధరల పెరుగుదల గుదిబండలా మారింది. ధరలు పెరగడానికి అనేక కారణాలున్నాయని వ్యాపారులు చెబుతున్నారు. చలికి కోళు పెద్ద ఎత్తున చనిపోయాయి. క్రిస్మస్, సంక్రాంతి పండు గలకు మరింత పెరుగుతాయని అంటున్నారు. అలాగే చలి ధాటికి కోళ్లు భారీగా చనిపోతున్నాయి. అందుకే కోడిగుడ్డు ఉత్పత్తి తగ్గి, డిమాండ్ అనూ హ్యంగా పెరుగుతోంది. ప్రస్తుతం డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతో, దాణా ధరలు పెరగడం, ఇతర ఖర్చుల కారణంగా చికెన్ ధరలు కూడా ఆకాశాన్ని తాకుతున్నాయి. మాంసం ప్రియులు, సామాన్య ప్రజలు కూరగాయల భోజనం చేయడమే ఉత్తమమని భావిస్తున్నారు.



మదనపల్లెలో మాజీ ప్రధాని వాజ్‌పేయి విగ్రహావిష్కరణ

-సుపరిపాలన అందించిన నేత : ఉత్తరాఖండ్ సిఎం

ప్రజాశక్తి - మదనపల్లె అర్బన్

భారతదేశంలో సుపరిపాలన అందించిన నేత భారతరత్న, మాజీ ప్రధాని వాజ్‌పేయి అని ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి కొనియాడారు. మదనపల్లె పట్టణం, అన్నమయ్య సర్కిల్‌లో ఏర్పాటు చేసిన వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని ఆదివారం సిఎం ఆవిష్కరించారు. మదనపల్లో ఏర్పాటు0 చేసిన కార్యక్రమంలో సిఎంతోపాటు మంత్రి సత్యకుమార్ యాదవ్, రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్, 20 సూత్రాల చైర్మన్ లంక దినకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి మాట్లాడుతూ దేశానికి సుపరిపాలన అందించి భవిష్యత్తు తరాలకు మార్గదర్శకులుగా వాజ్‌పేయి నిలిచారన్నారు. ప్రజల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేసి, అనేక సంస్కరణలు తీసుకొచ్చిన ఘనత వాజ్‌పేయికే దక్కుతుందన్నారు. వాజ్‌పేయి ఆశయాన్ని మోది కొనసాగిస్తూ సుపరిపాలన అందిస్తున్నారన్నారు. అనంతరం సభా ప్రాంగణం వరకు బిజెపి నేతలు భారీ ర్యాలీ చేపట్టారు. అంతకముందు బిటి కళాశాల మైదానంలో హెలిప్యాడ్ వద్ద సిఎం పుష్కర్ సింగ్ ధామికి మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాష, జేసి ఆదర్శ్ రాజేంద్రన్, సబ్ కలెక్టర్ కళ్యాణి, ఎస్‌పి ధీరజ్ కునుబిల్లి స్వాగతం పలికారు

ప్రయివేటీకరణ వైపు విశాఖ ఉక్కు అడుగులు

ప్రజాశక్తి - వేంపల్లె :విశాఖ ఉక్కును ప్రయివేటీకణ చేసేందుకు కేంద్రంలోని మోడీ ప్రభుత్వం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోందని పిసిసి అధికార ప్రతినిధి ఎన్.తులసిరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం వేంపల్లెలో ఆయన విలేక రులతో మా ట్లాడుతూ ఇప్పటికే విశాఖ ఉక్కు కర్మా గారంలో 1,590 మంది రెగ్యులర్ ఉద్యో గులకు విఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపించడం బాధా కరమన్నారు. 5,500 మంది కాంట్రాక్టు ఉద్యోగులను తొలగించారన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారంలో 32 విభాగాలను ప్రైవేటుపరం చేయాలని నిర్ణయించారని విమర్శించారు. ఇం దులో ప్రధాన ఉత్పత్తి విభాగాన్ని ప్రైవేటుపరం చేస్తూ టెండర్లు పిలి చారన్నారు. ప్రయి వేటు పరం లేదు లేదంటూనే వడివడిగా ఆ వైపు అడుగులు పడుతున్నట్లు ఆరో పించారు. ఇంత జరుగుతున్నా చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభు త్వం నిమ్మకు నీరెత్తినట్లు ఉండడం అత్యంత శోచనీయమని ఆవేదన వ్యక్తం చేశారు.

సినిమాల్లో విలన్ పాత్రకు రెడ్డి పేరు పెడితే సహించం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

:సినిమాల్లో విలన్ పాత్రకు రెడ్డి పేరు పెడితే సహించేది లేదని రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ జాతీయ అధ్యక్షుడు యర్రపురెడ్డి సురేంద్రరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొన్ని తెలుగు సినిమాల్లో విలన్ లేదా నెగిటివ్ పాత్రలకు పదేపదే రెడ్డి అనే కులపేరును జోడిస్తూ చూపించడం పట్ల ఆ కులానికి చెందిన ప్రజలు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని పేర్కొన్నారు. అఖండ-2 సినిమాలో విలన్ పాత్రకు మద్దిరెడ్డి అనే పేరు పెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. సినిమా అనేది వినోదంతోపాటు సమాజంపై ప్రభావం చూపే శక్తివంతమైన మాధ్యమమని తెలిపారు. కథ అవసరం పేరుతో ఒక వ్యక్తి చేసే దుర్మార్గాన్ని అతని కులంతో ముడిపెట్టడం సరికాదన్నారు. విలన్ అనేది వ్యక్తి స్వభావం వల్ల ఏర్పడే పాత్రే తప్ప, కులానికి ప్రతినిధ్యం వహించదని స్పష్టం చేశారు. రెడ్డి కులం అంటే గుండాయితనం మాత్రమే కాదని, రైతులు, సైనికులు, విద్యావేత్తలు, సమాజ సేవకులు, దేశానికి త్యాగం చేసిన అనేక మంది రెడ్లు ఈ సమాజంలో ఉన్నారని గుర్తు చేశారు. అలాంటి కులాన్ని పదే పదే విలన్ పాత్రలతో ముడిపెట్టడం వినోదం కాదన్నారు. ఇది ఏ ఇతర కులంపై ద్వేషంతో చేసిన ప్రకటన కాదని, అన్ని కులాలను గౌరవిస్తూనే రెడ్డి కుల గౌరవాన్ని కాపాడుకోవాలనే న్యాయమైన అభ్యంతరం మాత్రమే అని ఆయన స్పష్టం చేశారు. రచయితలు, దర్శకులు, నిర్మాతలు ఇకనైనా ఆ ధోరణిని వెంటనే ఆపి, బాధ్యతాయుతమైన రచన వైపు అడుగులు వేయాలని ఆయన సూచించారు.

క్రికెట్ ఛాంపియన్‌గా కడప మండల జట్టు

ప్రజాశక్తి - కడప

కడప డివిజనల్ లెవెల్ ఉపాధ్యాయుల క్రికెట్ పోటీల విజేతగా కడప మండల జట్టు నిలిచింది. ఆదివారం మధ్యాహ్నం కడప నగరంలోని కెఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో డివిజనల్ లెవెల్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించారు. టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. దీంతో తొలుత బ్యాటింగ్‌కు దిగిన చింతకొమ్మదిన్నె జట్టు నిర్ణీత 15 ఓవర్లలో 94 పరుగులు చేసింది. అనంతరం 95 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన కడప జట్టు 13.2 ఓవర్లలోనే 6 వికెట్ల నష్టానికి 95 పరుగులు చేసి ఘన విజయం సాధించింది. జట్టులోని మహబూబ్‌బాషా 36 పురుగులతో రాణించి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. ఈ సందర్భంగా విజేతలుగా నిలిచిన కడప జట్టును విద్యాశాఖ అధికారుల అభినందించారు. డివిజనల్ లెవెల్ ట్రోఫీని చింతకొమ్మదిన్నె, వల్లూరు, పెండ్లిమర్రి ఎంఇఒలు రమాదేవి, విజయ రెడ్డి, నాయక్ విజేత జట్టుకు ట్రోఫీ అందించి అభినందించారు.

వైవీయూ బోటనీ స్కాలర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం వృక్ష శాస్త్రం విభాగం స్కాలర్ షేక్ ఖాదర్ బాషకు విశ్వవిద్యాలయం డాక్టరేట్‌ను ప్రకటించింది. పరిశోధకుడు షేక్.ఖాదర్‌బాష వృక్ష శాఖ ఆచార్యులు పి.ఎస్.షావలిఖాన్, సహ ఆచార్యులు ఎం. మాదక్క పర్యవేక్షణలో 'ది సైకలాజికల్ అండ్ మాలిక్యులర్ రెస్పాన్సెస్ టు డ్రాట్ స్ట్రెస్ ఇన్ సీసమమ్ ఇండికమ్ ఎల్' అనే అంశంపై పరిశోధన చేసి సిద్ధాంత గ్రంథాన్ని విశ్వవిద్యాలయానికి సమర్పించారు. విశ్వవిద్యాలయ విసి మార్గదర్శకాలతో నియమితులైన పరీక్షకుల బోర్డు, వైవా వోస్ కమిటీ సిఫారసుల ఆధారంగా షేక్.ఖాదర్ బాష డాక్టరేట్ కు అర్హత ఉన్నట్లు ప్రకటించారు. ఈ మేరకు విశ్వవిద్యాలయ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య ఎస్.వి. కృష్ణారావు స్కాలర్ ఖాదర్‌కు పిహెచ్‌డి నోటిఫికేషన్ ప్రకటించారు. షేక్.ఖాదర్ బాష రాసిన పరిశోధన పత్రాలు పలు అంతర్జాతీయ, జాతీయ జర్నల్స్‌లో ప్రచురితమయ్యాయి. డాక్టరేట్ అందుకున్న సందర్భంగా షేక్.ఖాదర్ బాషను అధ్యాపకులు, స్కాలార్లు, విద్యార్థులు అభినందించారు.

ఆకట్టుకున్న నాటకం

ప్రజాశక్తి-కడప అర్బన్

బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో బుద్ధునితో నా ప్రయాణం నాటకాన్ని హరిత ఫంక్షన్ హాల్ లో ప్రదర్శించారు. అద్భుతంగా సాగిన ఈ నాటకానికి మధ్య తరగతి ప్రజలు, ప్రముఖులు, విద్యార్థులు, మహిళలు హాజరయ్యారు. దుఃఖ నివారణకు, సమాజంలో శాంతి సౌభాగ్యం వెల్లివిరియడానికి బుద్ధుని మార్గాలే శరణ్యమని ఈ నాటకం తెలియజేసింది. ప్రపంచంలో ఈ రోజు జరుగుతున్న యుద్ధాలకు కారణం మితిమీరిన దురాశ, దీన్ని అంతం చేయకుండా సమాజంలో శాంతి రాదని ఈ నాటకం ద్వారా తెలియజేశారు. బౌద్ధం భారతీయ జీవన విధానాన్ని ప్రభావితం చేసింది. బౌద్ధం భారతీయ ప్రజల ఆత్మ అని తెలియజేసిన ఈ నాటకం ఆహూతులందరిని ఉర్రూతలూగించింది. నాటకం ప్రారంభంలో బుద్ధుడు, అంబేద్కర్ల చిత్రపటాలకు నగరంలోని ప్రముఖులు డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ రాజా వెంగళ రెడ్డి, డాక్టర్ రాజేశ్వరమ్మ, డాక్టర్ అశోక్ కుమార్, సీనియర్ లాయర్ సంపత్ కుమార్, బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీ అధ్యక్షులు పిళ్లా కుమారస్వామి రెడ్డి, ఎస్‌వి ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ సుదర్శన్ రెడ్డి, శ్రీహరి డిగ్రీ కాలేజ్ చెన్నకేశవరెడ్డి, వివేకానంద డిగ్రీ కాలేజ్ ఉపన్యాసకులు సునీత నివాళులర్పించారు. నాటకం ఆద్యంతం బుద్ధుడి చరిత్రను అంబేద్కర్ ద్వారా సహజ సిద్ధమైన రీతిలో ఆధునిక సాంకేతికతను జోడించి నాటకాన్ని రక్తి కట్టించారు. ఈ నాటకాన్ని తిలకించిన ప్రజలు మంచి నాటకాన్ని ప్రదర్శించారని బుద్ధిస్ట్ కల్చరల్ సొసైటీని కొనియాడారు. భవిష్యత్తులో ఇలాంటి నాటకాలను మరిన్ని ప్రదర్శించాలని వారు కోరారు. నాటకం తిలకించడానికి వచ్చిన వారిలో అడిషనల్ మున్సిపల్ కమిషనర్ రాకేష్, నాగముని రెడ్డి, డాక్టర్ నిర్మల, ఈఈ గురప్ప ప్రముఖులు ఉన్నారు.



ప్రశ్న పత్రాలను చూపుతున్న విద్యార్థులు

మోడల్ ప్రశ్న పత్రాలు పంపిణీ

ప్రజాశక్తి-గుర్రంకొండ

పదవ తరగతి విద్యార్థులకు మోడల్ ప్రశ్న పత్రాలు రీడో సేవా సంస్థ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఐల ఈశ్వరయ్య ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి ప్రాముఖ్యత, విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించి చెప్పారు.చదువుపై శ్రద్ధ, ఏకాగ్రత, తపన, అంకితభావం ఉంటే అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని చెప్పారు. 47 మంది విద్యార్థులకు మొత్తం 329 పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ మోడల్ క్వశ్చన్ పేపర్స్ పిల్లలకు చాలా ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులకు మోటివేషన్ క్లాసెస్ కూడా నిర్వహణ చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నోబెల్ టీచర్స్ అసోసియేషన్ గుర్రంకొండ మండల అధ్యక్షులు, ఉపాధ్యాయుడు బండారు త్రినాధరావు, కన్యకా పరమేశ్వరి దేవాలయ కమిటీ, ఉపాధ్యక్షులు మాకం వెంకటేశ్వర్లు, ఆంజనేయ మాలాధారణ గురువు ఉప్పు శ్రీనివాసులు ప్రిన్సిపల్ సుమిత్ర , ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరబల్లి

మండల కేంద్రంలోని జడ్‌పి హైస్కూల్‌లో సోమవారం ఉచిత మెగా వైద్య శిబిరం జరుగుతుందని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి మండల అధ్యక్షుడు భానుగోపాల్‌రాజు తెలిపారు. శ్రీ రమాదేవి మల్టీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ తిరుపతి నిర్వహించే వైద్యశిబిరంలో రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్‌మోహన్‌రాజు పాల్గొంటారని తెలిపారు. ఈ మెగా వైద్య శిబిరం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని తెలిపారు. వైద్య శిబిరానికి వచ్చువారు ఆధార్ కార్డు, ఆరోగ్యశ్రీ కార్డు, సెల్ ఫోన్ నెంబర్ తీసుకురావాలన్నారు. ఉచిత వైద్య శిబిరానికి వచ్చు వారికి రక్త పరీక్షలు, స్కానింగ్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా అర్హులైన వారికి అత్యధిక పద్ధతి ద్వారా కోత, కుట్టు లేకుండా లేబర్ లేపరోస్కోపీ పద్ధతి ద్వారా ఉచిత ఆపరేషన్లు నిర్వహిస్తారని చెప్పారు. మండల ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



కరాటే పోటీల్లో పతకాలు సాధించిన విద్యార్థులు

కరాటే పోటీల్లో సత్తాచాటిన 'మాధురి' విద్యార్థులు

ప్రజాశక్తి-సుండుపల్లి :విశాఖపట్నంలో ఆదివారం ఎసియన్ కరాటే ఫౌండేషన్ నిర్వహిం చిన కరాటే పోటీలలో సుండుపల్లిలోని మాధురి స్కూల్ విద్యార్థులు సత్తాచా టిన ట్లు పాఠశాల కరస్పాండెంట్ రేపన సుధాకర్ తెలిపారు. విద్యార్థులకు సంస్థ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ కరాటే పైన శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ఈ పోటీలో పాల్గొని గోల్డ్ మెడల్ 3, సిల్వర్ మెడల్, బ్రోసిన్ మెడల్ దక్కించుకున్నారని చెప్పారు. ప్రస్తుతం కాలానుగుణంగా విద్యార్థుల నైపుణ్యాన్ని బట్టి శిక్షణ ఇవ్వడం మా ప్రత్యేకతని చెప్పారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రనాయక్‌పాల్గొన్నారు.

ఢిల్లీకి బయల్దేరిన బిసిలు

జమ్మలమడుగు : బిసిలకు చట్ట సభలలో 50 శాతం రిజర్వేషన్స్ కలిపించాలని పార్లమెంట్‌లో బిల్లు ప్రవేశపెట్టాలని కోరుతూ ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద జరుగబోయే ధర్నాకు రాష్ట్ర అధ్యక్షులు ఆవుల నరసింహారావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి ఆధ్వర్యంలో విజయవాడ రైల్వేస్టేషన్ నుండి భారీగా బీసీలు బయలుదేరారు. ఆదివారం వారు విజయవాడ నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ మంగళవారం ఢిల్లీలో ధర్నా జరుగుతుందని, దేశవ్యాప్తంగా బిసిలు హాజరవుతున్నారన్నారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలా శివ గోపి, బత్తుల గీత పలువురు బిసిలు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్ : రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం బి.కొత్తకోట మండలంలో జరిగింది.పోలీసుల కథనం మేరకు.. గుర్రంకొండ మండలం తరిగొండకు చెందిన మహమ్మద్ జాఫర్ మదనపల్లి మండలం సిటిఎంలో వెల్డింగ్ షాప్ నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. అతని వద్ద కదిరికి చెందిన షాహుద్దీన్ వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఇద్దరు కలిసి ద్విచక్రవాహనంలో కదిరికి వెళ్లారు. అక్కడ పని ముగించుకుని తిరిగి సిటిఎం కు బయల్దేరారు. మార్గమధ్యంలోని గోళ్లపల్లి వద్ద ఎదురుగా వచ్చిన బస్సును ఢీకొని తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వెంటనే బాధితులను 108లో మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు ఆస్పత్రిలో చేర్చి చికిత్స అందిస్తున్నారు. బి.కొత్తకోట పోలీసులు విచారిస్తున్నారు.

మొగిలిపెంట అటవీప్రాంతంలో ఇద్దరు అరెస్టు

-గొడ్డళ్లు, రంపాలు స్వాధీనం

ప్రజాశక్తి -రైల్వేకోడూరు: మండలంలోని మొగిలిపెంట అడవుల్లో ప్రవేశించిన ఇద్దరు ఎర్రచందనం కూలీలను టాస్క్ ఫోర్స్ పోలీసులు ఆదివారం తెల్లవారుజామున అరెస్టు చేసినట్లు రైల్వే కోడూరు టాస్క్ ఫోర్స్ సబ్ కంట్రోల్ ఆర్ఐ కృపానంద తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టాస్క్ ఫోర్స్ హెడ్ ఎల్.సుబ్బారాయుడు కార్యాచరణ మేరకు టాస్క్‌ఫోర్స్ ఎస్‌పి పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎఎస్‌పి జె. కులశేఖర్ పర్యవేక్షణలో డిఎస్‌పి ఎండి షరీఫ్ మార్గనిర్దేశక త్వంలో ఎఆర్ఎస్ఐ బాల చెన్నయ్య బృందం స్థానిక ఎఫ్ఆర్ఓ కె. విజయకృష్ణతో కలసి శనివారం తిరుమల చేరుకుని, అక్కడ నుంచి అన్నదమ్ముల బండ మీదుగా మొగిలి పెంట చేరుకున్నారని తెలిపారు. అక్కడ తిమ్మయ్యగుంట వద్ద కొందరు వ్యక్తులు కనిపించగా వారిని సమీపించే లోపు పోలీసులను చూసిన వారు పారి పోయే ప్రయత్నం చేశారని వారిని వెంబడించి ఇద్దరిని పట్టుకోగా మిగిలిన వారు చీకట్లో పారిపోయారని తెలిపారు. వారి వద్ద నుంచి రంపాలు, గొడ్డళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. పట్టు బడ్డ వారిని తమిళనాడు జమునామత్తూరు జిల్లాకు చెందిన వారిగా గుర్తించినట్లు చెప్పారు. వారిని తిరుపతి టాస్క్ ఫోర్స్ పోలీసు స్టేషన్ కు తరలించగా ఎస్ఐ సిహెచ్ రఫీ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని తెలిపారు.



అరెస్టయిన నిందితులతో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది